క్లుప్తంగా

సరిహద్దు రోడ్లను అభివృద్ధి చేయండి



మంత్రి మునియప్పను కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: బెంగళూరులోని విధానసౌధలో మంగళవారం కర్ణాటక రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి మునియప్పను ఎమ్మెల్యే తిప్పేస్వామి కలిశారు. మడకశిర నియోజకవర్గంలోని సరిహద్దు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట పావగడ కాంగ్రెస్ నాయకుడు నరసప్ప కూడా ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక దంపతులు

హిందూపురం: హిందూపురం సమీపంలోని పెద్దిరెడ్డిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక భక్తిశ్రద్ధలతో గోపూజ చేశారు. మంగళవారం కౌన్సిలర్ నాగేంద్ర బాబు స్వగృహానికి వెళ్లిన సమన్వయకర్త దీపిక ముందుగా గోపూజ చేసిన తర్వాత తేనేటి విందుకు హాజరయ్యారు.

ఆలయంలో చోరీకి యత్నం

రొళ్ల: దొడ్డేరి గ్రామ సమీపంలోని కొత్తపల్లికి వెళ్లే రోడ్డు పక్కన వెలసిన దొడ్డేరమ్మ ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున దొంగలు చోరీకి యత్నించారు. ఆలయం ముందు భాగంలో ఉన్న తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించడానికి ప్రయత్నించారు. అయితే లోపల ఉన్న తలుపులు తీయడంలో విఫలమయ్యారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో అర్చకుడు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

యూపీ వాసి మృతి



మృతుడు సంజీవ్ కుమార్

పెనుకొండ రూరల్: పట్టణ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ సంజీవకుమార్ గుండెపోటుతో మృతి చెందారు. చెన్నై నుంచి కొరియర్ గూడ్స్ వెహికలత్‌తో ఆగ్రాకు వెళ్తుండగా సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వాహనం కదలకపోవడంతో జీపీఎస్ ట్రాకర్ ద్వారా విషయాన్ని తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ జీవన్ తెలిపారు.

హంద్రీనీవా కాలువలో ద్విచక్ర వాహనం



కాలువలో పడి ఉన్న ద్విచక్ర వాహనం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కొండంపల్లి క్రాస్ సమీపంలోని హంద్రీనీవా కాలువలో ఓ ద్విచక్ర వాహనం (టీవీఎస్ సూపర్ ఎక్స్ ఎల్) పడి ఉంది. మంగళవారం అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎవరైన ప్రమాదవశాత్తూ పడి వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లారా? లేదా దొంగలించి అక్కడ పడేసి వెళ్లారా అన్నది చర్చనీయాంశమైంది.

'గృహలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోండి

పావగడ: సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ మహిళలకు సూచించారు. మంగళవారం తాలూకాలోని వళ్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళకు గృహ లక్ష్మి పథకం ప్రమాణ పత్రాన్ని అందించి గ్రామ 1 కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



టెట్రా పాకెట్లతో పట్టుబడిన మారుతీ

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని బాపూజీనగర్‌కు చెందిన మారుతీ అనే వ్యక్తి ఇంట్లో 458 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ హరూన్‌తో పాటు సిబ్బంది నరేష్, వెంకటరెడ్డి, అనిల్, గోపాల్ పాల్గొన్నారన్నారు. మారుతీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

రైతన్నలూ పారాహుషార్!



- వర్షాలతో అన్నిచోట్లా పరుచుకున్న పచ్చదనం
- వ్యవసాయ పనుల్లో అన్నదాతల నిమగ్నం
- విషపురుగులతో పొంచి ఉన్న ప్రమాదం
- జాగ్రత్తలు పాటిస్తేనే ప్రాణానికి రక్ష

రొళ్ల: వాన కాలం ప్రారంభం కావడంతో అన్ని ప్రాంతాలూ పచ్చదనంతో నిండాయి. బీడు భూములు, అటవీ ప్రాంతాల్లో కూడా మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పాములు, విష పురుగులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండే వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాము కాటుకు గురయ్యే అవకాశం ఉంది.

ఆహారం కోసం బయటకు...

వర్షాకాలం కావడంతో ముఖ్యంగా కప్పలు ఎక్కువగా బయటకు వచ్చేస్తుంటాయి. వాటితో పాటు బల్లులు, ఎలుకలు, తొండలను కూడా పాములు వేటాడుతుంటాయి. కుంటలు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డి వాములు, పేర్చిన కట్టెలు, ఇటుకలు ఇతరాత్ర ప్రదేశాల్లో విషపురుగులు ఎక్కువగా సంచరిస్తుంటయి. అయితే ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాము కాటుతో ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా మడకశిర ప్రాంతంలో ఎక్కువగా కట్ల పాము, తాచు పాము, రక్త పింజర వంటి విషపూరిత పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఒకవేళ ఎవరైనా పాముకాటుకు గురైతే సరైన వెంటనే వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాలు కూడా పోగొట్టుకోవాల్సిందే.

పాము కాటు ఇలా..

పాములకు చెవులు లేనప్పటికీ వాటి శరీరం కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసులు ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహిస్తాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు సమీపంలోకి వచ్చినప్పుడు వెంటనే వాటిని గుర్తించి కాటు వేస్తాయి. పాముల ఏకాంతానికి భంగం కలిగినప్పుడు, ప్రాణ భయం ఉన్నప్పుడు, ఎవరైన తొక్కినప్పుడు మాత్రమే అవి వెంటనే కాటు వేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

గ్రామీణా ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తిరిగే వారితో పాటు పొలాల దగ్గర నిద్రించే రైతులు, కూలీలు వెంట టార్చ్ లైటు ఉంచుకోవాలి. ఉన్న ప్రదేశాలను రోజు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పాములు కిరోసిన్, పెట్రోలు, డీజిల్ వాసన భరించలేవు. ఎక్కువగా ఉన్నచోట వీటిని ఉపయోగిస్తే మంచిది. రైతులు, కూలీలు రాత్రి వేళల్లో తిరిగేటప్పుడు కూడా మోకాళ్ల వరకు రబ్బరు బూట్లు వేసుకోవడం ఉత్తమం. గడ్డి పని చేసే వారు చేతికి రబ్బరు తొడుగులు తొడుక్కోవాలి. ఇళ్ల చుట్టూ పొదలు లేకుండా చూసుకోవాలి.

ప్రథమ చికిత్స ఇలా ...

- పాము కాటు వేసిన పై భాగంలో వెంటనే రక్త ప్రసరణ జరగకుండా బిగించి తాడుతో కట్టాలి. కాటు వేసిన శరీర భాగంలో బ్లేడుతో గాయం చేసి రక్తం కారనివ్వాలి.
- పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. పక్కన వ్యక్తి ఉంటే బాధితుడికి ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించాలి.
- కాటు వేసిన పాము అంతకు ముందు ఆహారం తిన్న, మరో జీవికి కాటు వేసినా విషం తీవ్రత తక్కువగా ఉండేందుకు అవకాశం ఉంది.
- పాము కాటు వేసిన వ్యక్తికి ఎట్టి పరిస్థితుల్లోను ఆహారం ఇవ్వకూడదు, నడిపించడంతో పాటు పరుగెత్తించకూడదు.
- నాటు మందు, మాత్రలు అని కాలయాపన చేయకుండా వెంటనే దగ్గర్లోని వైద్యశాలకు తరలించాలి.
- పాము కాటుకు గురైన వ్యక్తిని నిద్ర పోకుండా చూసుకుని, కదలించ కుండా ఆస్పత్రికి చేర్చాలి.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు-1 గ్రామ పంచాయతీలో మద్దనకుంట గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అమరాపురం: హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బైపీసీలో ఎస్టీ కేటగిరికి 3, బీసీ 1 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. అలాగే ఎంపీసీ కోర్సులో ఓసీ 1 సీటు ఖాళీ ఉందన్నారు. ఈ ఏడాది మార్చి పదో తరగతి పరీక్షల్లో రెగ్యులర్‌గా 360 మార్కులపైన సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 26లోగా దరఖాస్తు చేసుకోవాలని, 27న మార్కుల ప్రాతిపదికన సీటు కేటాయిస్తామన్నారు.

హిందూపురం: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ కళాశాల కోర్సులో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగమణి తెలిపారు. బైపీసీలో బీసీకి 02, ఎస్టీ 01, ఎంపీసీలో ఎస్టీకి 02, బీసీ 01, ఓసీ 01 మొత్తం 07 ఖాళీలున్నాయన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 7981491964 సంప్రదించాలన్నారు.

ఓటరు సర్వే పక్కాగా నిర్వహించండి



ఓటరు సర్వేపై సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: ప్రణాళికాబద్ధంగా ఓటరు సర్వే నిర్వహించాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ బీఎల్‌ఓలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఓటరు సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. యాప్ పని చేస్తోందా? ఏమైనా సమస్యలున్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడం అన్యాయం

అగళి: 'ప్రిన్సిపాల్ చక్రధారిని సస్పెండ్ చేయడం అన్యాయం, తిరిగి తమకు ఆయన్నే ప్రిన్సిపాల్‌గా కొనసాగించాలి' అంటూ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంఈఓ-2 చంద్రశేఖర్, తహసీల్దార్, ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

మడకశిరలో వర్షం

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలో సోమవారం మోస్తరుగా వర్షం కురిసింది. మడకశిర మండలంలో 10.4 ఎంఎం, గుడిబండ 16.2, అమరాపురం 8.2, రొళ్ల 3.2, అగళి 4.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఏఓగా శంకర్‌నాయక్

పెనుకొండ: మండల వ్యవసాయాధికారిగా బి.శంకర్‌నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కదిరి డివిజన్‌లో పని చేస్తున్న ఆయన బదలీపై ఇక్కడి వచ్చారు.

నేటి నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ పర్యటన

పరిగి: మండలంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటూ ఏపీ ఫుడ్ ప్రాసెస్‌పై ఎంఎస్‌ఎంఈ స్ఫూర్తి ప్రాజెక్టు డైరెక్టర్ వీరయ్య పర్యటిస్తారని వైకేపీ ఏపీఎం దేవానంద్ ఫిలిప్పన్ తెలిపారు.

అమ్మవారి ఊరేగింపు

మడకశిరరూరల్: మారెమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి 41రోజు పూర్తయిన సందర్భంగా మెళవాయి గ్రామంలో మంగళవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

మడకశిర: పట్టణంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. గాంధీ బజార్‌లోని తేరుబయలు పీర్ల చావడిలో పీర్ల పెట్టెను ఊరేగించారు. కోటవీధితో పాటు పలు ప్రాంతాల్లో మొహర్రం సందర్భంగా పీర్ల పెట్టెలకు పూజలు చేశారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడండి

మడకశిర: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలని ఎంపీపీ కవిత సూచించారు. ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయొద్దని ఎంపీపీ అధికారులను కోరారు. మరోవైపు 14, 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు అందించకపోవడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు సర్పంచులు సమావేశానికి హాజరు కాకుండా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

యానిమేటర్ల కమిటీ ఎన్నిక

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో యానిమేటర్లు (వీఓఏ)లు మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం యానిమేటర్ల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా సునందమ్మ, కార్యదర్శిగా మహాలక్ష్మి, కోశాధికారిగా ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా సునితమ్మ, సలహాదారుగా ఫక్కీరప్ప, ట్రెజరర్‌గా శ్రీరామిరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు

పెనుకొండ: పట్టణంలోని మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న జగనన్న స్మార్ట్‌సిటీలో మంగళవారం పేదలు సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నారు. తహసీల్దార్ స్వర్ణలత, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, పోలీసులు ఎంత వారించినా ఎవరూ స్పందించలేదు. ఈ నేపథ్యంలో సబ్‌కలెక్టర్ కార్తీక్ తన చాంబర్‌లో అధికారులతో సమావేశమై కలెక్టర్‌తో పాటు, జిల్లా ఎస్పీకి భూ ఆక్రమణ విషయాన్ని వివరించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శంకరనారాయణ



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: పేదల సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మండల పరిధిలోని పాలసముద్రం, కొండ్రెడ్డిపల్లి గ్రామల్లో సర్పంచులు చిన్నగంగంప్ప, సుశీలమ్మల నేతృత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ స్వరాజ్యస్థాపనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అందరికీ న్యాయం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్‌సాహెబ్, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్, ఎంపీపీ ప్రమీల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, నాయకులు గోవిందరెడ్డి, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోరంట్ల: మండల పరిధిలోని యర్రయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి భార్య రత్నమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి చేరుకొని రత్నమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్యులు మంగళవారం అధిక శ్రావణ మాసం పూజలు నిర్వహించారు. గోడంబి, ద్రాక్ష, బాదం, తదితర వాటితో అమ్మవారిని అలంకరించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పండి



హిందూపురం: అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం టౌన్/పెనుకొండ:/సోమందేపల్లి: మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక దాడులు, మారణ హోమాన్ని నియంత్రించి శాంతిని నెలకొల్పాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. హిందూపురంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ చేపట్టి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. మణిపూర్‌లో మానవహక్కులను కాపాడాలని పెనుకొండ డివిజన్ సీపీఐ కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. పెనుకొండ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ సోమందేపల్లిలో సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

బదిలీ సిబ్బందికి సత్కారం

పరిగి: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన వైద్యారోగ్య ఫార్మసిస్టు ఇనాయతుల్లా, ల్యాబ్ టెక్నీషియన్ వహీద బేగం, స్టాఫ్ నర్సులు ప్రభావతి, అంబూజాక్షి ఘనంగా సన్మానించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవీన, డాక్టర్ స్వరూపరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బదిలీ సిబ్బంది సేవలను కొనియాడారు.

ఉచిత వైద్య శిబిరం

పావగడ: తాలూకా కేంద్రంలోని తేజస్ లాడ్జి మీటింగ్ హాల్‌లో మంగళవారం తేజస్ చారిటబల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఎంఎస్ రామయ్య ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వెనుకబడిన పావగడ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ట్రస్ట్ కార్యదర్శి గాయత్రిబాయి తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షుడు సోమ్లానాయక్ , రామయ్య ఆస్పత్రి ప్రముఖ వైద్యులు అభిలాష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ న్యాయం

- ఎమ్మెల్యే శంకరనారాయణ
- అన్ని ప్రాంతాల్లోనూ కొనసాగుతున్న జగనన్న సురక్ష



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



శెట్టిపల్లిలో ధ్రువీకరణ పత్రాలు చూపుతున్న లబ్ధిదారులు

గోరంట్ల: అర్హత ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ లబ్ధికి దూరంగా ఉన్న వారికి న్యాయం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. మండల పరిధిలోని పాలసముద్రం సచివాలయ ప్రాంగణంలో మంగళవారం సర్పంచ్ చిన్నగంగంప్ప అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఏ రాజకీయ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం అమలు చేసిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు 11 రకాల సర్టిఫికెట్ల ప్రభుత్వం ఉచితంగానే అందజేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందజేసే ధ్రువ పత్రాలు సంక్షేమ పథకాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు బాషా, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న చేస్తున్న మేలును తామెన్నటికీ మరువలేమని లబ్ధిదారులు తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ సరస్వతి, తహసీల్దారు సౌజన్య లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 2,230 మంది లబ్ధిదారులకు వివిధ సర్టిఫికేట్లను అందించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ విజయకుమార్, సర్పంచ్ మల్లక్క, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి , సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ కార్యదర్శి కిరణ్, నాయకులు కృష్టారెడ్డి, శ్రీనివాసులు, వడ్డే నాగరాజు, గంగప్ప, సోము తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని కొండూరు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 998 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి , ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, ఎంపీటీసీ సభ్యులు అశ్వత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం దేమకేతేపల్లి-1 సచివాలయం వద్ద సర్పంచ్ ఈడిగ తిరుమలేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 605 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్ కుమార్, ఎంపీటీసీ సుధాకర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1178 మందికి ధ్రువపత్రాలు అందజేసినట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఈఓఆర్డీ శ్రీదేవి, సర్పంచ్ శ్యామల బాయి, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆజాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హులీకుంట సచివాలయం ఆవరణలో 'జగనన్న సురక్ష' పథకం కార్యక్రమం పై సమావేశం నిర్వహించి లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ కరియమ్మ, ఎంపీటీసీ సుమ, వైస్ సర్పంచ్ రవికుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఈఓఆర్డీ క్రిష్టప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్, నాగరాజు, ముద్దారెడ్డి, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ చంద్రశేఖర్ సర్పంచ్ మంజునాథ్, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, ముఖ్యనాయకులు ఎస్ నారాయణరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు వరమని ఎంపీడీఓ మునిస్వామి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయలు అన్నారు. మంగళవారం మండలంలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయంలో , సర్పంచ్ గిరిజమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష సమావేశం జరిగింది. మండలంలోని హేమావతి గ్రామ సచివాలయం- 2లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీఓ మునిస్వామి, ఆర్ఐ.గిరియప్ప, తదితరులు పాల్గొన్నారు.

పట్టా మంజూరు చేయండి

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టిలో ఆర్డీటీ సహకారంలో కమ్యూనిటీ భవనంతో పాటు ట్యూషన్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని సీడీసీ మెంబర్లు వెంకటస్వామి, అశోక్, బాబురెడ్డి, కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఏడు సెంట్లు ప్రభుత్వ స్థలం నిరుపయోగంగా ఉందని, దాన్ని కేటాయిస్తే రెండు భవనాలు నిర్మించుకోవచ్చన్నారు. దీనిపై స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీని కలిసి వినతిపత్రాన్ని అందించామన్నారు. స్పందించిన అధికారులు సర్వే చేయించి పట్టా ఇవ్వడానికి చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రవికుమార్, సీడీసీ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటు కోళ్ల అపహరణ

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రొప్ప గ్రామంలో 18 నాటుకోళ్ల అపహరణకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రొప్ప గ్రామానికి చెందిన సుధ అనే మహిళ నాటు కోళ్ల పెంపకంతో జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి దుండగులు ఇంటి వద్ద ఉన్న 40 కోళ్లలో 18 నాటుకోళ్లను ఎత్తుకెళ్లారు. ఇదిలా ఉంటే కోళ్లను దొంగిలించి పరారవుతున్న నలుగురిలో ఒక దొంగను గ్రామస్తులు పట్టుకున్నారు. అయితే దొంగ ఉదయం బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కోళ్ల అపహరణతో రూ.50 వేల నష్టం వచ్చిందని సుధ వాపోయారు.